

నేడు రేషన్ షాపుల బంద్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో రేషన్ డీలర్లకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈనెల 5న రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కరోజు రేషన్ షాపులను బంద్ చేస్తున్నట్లు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభం యాదగిరి, ప్రధాన కార్యదర్శి బిర్రు వెంకటనారాయణ, రాష్ట్ర నాయకులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం నెలకు రూ.5 వేలు, క్వింటాకు కమిషన్ రూ.300 అందించాలని కోరారు. రేషన్ డీలర్లు షాపులను బంద్ చేయాలని, అందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్ ముందు నిప్పుపెట్టిన అనంతరం షట్టర్‌పై రాళ్లతో దాడి చేస్తున్న రైతులు




అన్నదాత ఆక్రోశం

- మానుకోటలో యూరియా కోసం తిరుగుబాటు
- దుకాణం ఎదుట నిప్పుపెట్టి నిరసన
- పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చిన పోలీసులు
- గూడూరులో సొసైటీ వద్ద ఉద్రిక్తత
- కొత్తగూడలో బస్తాలు మాయం..
- సరిపడా యూరియా ఇస్తాం : డీఏవో

ఎరువుల షాపుపై రాళ్లతో రైతుల దాడి

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యూరియా బస్తాల కోసం రైతులు తిరుగుబాటు చేశారు. బస్తాలు పంపిణీ చేస్తుండగా.. కర్షకులు ఎగబడడంతో యాజమాని షాపు మూసివేసి వెళ్లిపోవడంతో ఆగ్రహించిన రైతులు ఆ దుకాణంపై ఇటుకలు, రాళ్లతో దాడి చేశారు. ఆ ఎరువుల దుకాణం ముందు కర్రలు వేసి దగ్ధం చేసి, తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దాంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటన గురువారం మానుకోట పట్టణంలో కొనసాగింది. కాగా, మహబూబాబాద్ జిల్లాలో గూడూరు, నర్సింహులపేట, కొత్తగూడ తదితర మండలాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

జిల్లా కేంద్రంలోని సూర్యథియేటర్ సమీపంలోని మన గ్రోమోర్ సెంటర్‌లో బుధవారం 330 (12 టన్నుల) యూరియా బస్తాలు వచ్చాయి. వాటికి సంబంధించిన పంపిణీని వ్యవసాయశాఖ అధికారులు టోకెన్లు జారీ చేశారు. అయితే మనగ్రోమోర్ యాజమాని కొన్ని బస్తాలు మాత్రమే ఇచ్చి రేపు మళ్లీ ఇస్తామని చెప్పి షాపు బంద్ చేసి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం మళ్లీ యూరియా కోసం రైతులు వచ్చారు. క్యూలైన్‌లో నిలబడ్డారు.



పాగుళ్లపల్లిలో చికిత్స పొందున్న కుంజ లక్ష్మీనర్సు

కొంతమంది తనకు దగ్గరున్న రైతులకు యూరియా బస్తాలు ఇస్తుండడం, గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉన్నారు. తాము గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడినప్పటికి యూరియా బస్తాలు అందించడంలో జాప్యం చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. రైతులు బస్తాల కోసం ఎగబడడంతో షాపు యాజమాని దుకాణం మూసివేసి వెళ్లి పోయాడు. దాంతో ఆగ్రహించిన రైతులు మూసివున్న దుకాణంపై ఇటుకలు, రాళ్లతో షాపుపై దాడికి పాల్పడ్డారు. పైన ఉన్న బోర్డుపై రాళ్లు విసరడంతో అది ధ్వంసమైంది. దుకాణం ముందు కర్రలు వేసి నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. కొంతమంది మహిళ రైతులు దుమ్మెత్తి షాపుపై పోశారు.

తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొనడంతో పోలీసులకు సమాచారం అంది అక్కడికి చేరుకున్నారు. అనంతరం కొంతమంది రైతులు మనగ్రోమోర్ గోదాం వద్దకు చేరుకుని గోదాం తాళాలు పగులగొట్టి యూరియా బస్తాలను తీసుకువెళ్తుండగా పోలీసులు అడ్డగించి వారిని మళ్లీ శాంతింప వేలిముద్రలు తీసుకుని మళ్లీ వారికే యూరియా బస్తాలను ఇప్పించారు. పోలీసులు రైతులతో మాట్లాడి శాంతింపచేసి మనగ్రోమోర్‌కు సంబంధించిన గోదాం వద్దకు తరలించి షాపు యాజమానితో మాట్లాడి రైతులను క్యూలైన్‌లో నిలబెట్టి అందులో ఉన్న 180 బస్తాల యూరియాను రైతులకు అందించారు. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, సీఐలు మహేందర్‌రెడ్డి, సర్వయ్య, తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్‌రావుల పర్యవేక్షణలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. అలాగే బస్టాండ్ ముందు ఉన్న ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంకు 15 టన్నుల యూరియా రాగా, ఉదయం ఒక్కసారిగా రైతులు ఎగబడడంతో షాపు యాజమాని దుకాణం బంద్ చేసి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం సమయంలో పోలీసులు వచ్చి దుకాణం తెరిపించి రైతులను క్యూలైన్‌లో నిలబెట్టి యూరియా బస్తాలను ఇప్పించారు.

గూడూరులో పీఏసీఎస్ వద్ద..

గూడూరు : గూడూరు పీఏసీఎస్ వద్ద యూరియా పంపిణీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బస్తాల కోసం ఉదయం 5గంటలకే రైతులు సొసైటీ వద్దకు చేరుకుని భారీ సంఖ్యలో బారులు తీరారు. ఈ క్రమంలో గతంలో టోకెన్లు జారీ చేసిన వారికి మాత్రమే బస్తాలు అందిస్తామని అధికారులు

(మిగతా 6లో..)



నర్సింహులపేటలోకి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కూపన్ల కోసం బారులు రైతులు



గూడూరు సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు



గూడూరు సొసైటీ వద్ద చేతి గాయాన్ని చూపుతున్న దరంసోత్ కాంతి

నిమజ్జనానికి వేళాయే..

నేడు జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనం

- చెరువుల వద్ద ఏర్పాట్లు పూర్తి
- ముగియనున్న నవరాత్రి ఉత్సవాలు



మహబూబాబాద్ నిజాం చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, అధికారులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నవరాత్రులు భక్తులచే పూజలందుకున్న వినాయక విగ్రహాలు నిమజ్జనానికి సిద్ధమయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలో చవితి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఆగస్టు 27న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని తొర్రూరు, మరిపెడ, మానుకోట, డోర్నకల్ మునిసిపాలిటీలతో పాటు 18 మండలాల పరిధిలోని మండపాల్లో ఏర్పాటు చేసిన 814 వినాయక విగ్రహాల వద్ద భక్తులు తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ నెల 5న ఉత్సవాలు ముగుస్తుండడంతో వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేయనున్నారు. అందుకు గ్రామాలు, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసి సర్వం సిద్ధం చేశారు. జిల్లా కేంద్రంలోని నిజాం చెరువు, తొర్రూరు మునిసిపల్ కేంద్రంలో పెద్ద చెరువు, డోర్నకల్‌లో బతుకమ్మ చెరువు, మరిపెడ మునిసిపల్ శివారు పురుషోత్తమాయగూడెం, మాకుల పెద్ద చెరువుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా నిమజ్జనం చేసే చెరువుల వద్ద రెవెన్యూ, పోలీసు, మునిసిపల్, గ్రామ పంచాయతీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసి సర్వం సిద్ధం చేశారు.

మానుకోట నిజాం చెరువు వద్ద..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని దాదాపు 210 విగ్రహాలను ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని నిజాం చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. అందుకు మునిసిపల్ అధికారులు

(మిగతా 6లో..)



నిజాం చెరువు వద్ద లైట్లను పెట్టేందుకు కొత్త విద్యుత్ పోల్లను వేస్తున్న సిబ్బంది

జీపీవో అభ్యర్థులకు నేడు నియామక ఉత్తర్వులు

- జిల్లా అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్




సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

మహబూబాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పరిపాలనా అధికారులు (జీపీవో)గా ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జీపీవో అభ్యర్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 180 క్లస్టర్లకు గాను 163 మంది గ్రామ పరిపాలన అధికారులను కేటాయించడం జరిగిందని, ఇందులో స్థానికులు 151 మంది ఉండగా ఇతర జిల్లాల నుంచి 12 మంది కేటాయించారని తెలిపారు. వారికి పూర్తి అవగాహన కల్పించి ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సర్టిఫికెట్లను పరిశీలించి వారి నుంచి ఆప్షన్ ఫారాలను స్వీకరించడం జరిగిందన్నారు. వీరందరికి ఈనెల 5న సీఎం చేతుల మీదుగా ఆర్డర్ కాపీలను అంద జేయనున్నట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి శుక్రవారం ఉదయం 6 గంటలకు మూడు బస్సుల్లో వీరందరిని హైదరాబాద్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధికారులు మదన్‌గోపాల్, రాఘవరెడ్డి, సునీల్‌కుమార్, ఖయ్యూం పాల్గొన్నారు.

గురువులకు జేజేలు..

ఉమ్మడి జిల్లా నుంచి 9మందికి రాష్ట్ర స్థాయి బెస్ట్ టీచర్ అవార్డులు

- ఉత్తమ సేవలకు దక్కిన గుర్తింపు
- ఆయా విద్యాసంస్థల్లో హర్షాతిరేకాలు
- నేడు హైదరాబాద్‌లో ప్రదానోత్సవం



గడ్డం వెంకన్న, అరుణ, గణ్‌సింగ్, ప్రశాంతి, ప్రసాద్, చెడిపాక రాములు, సునీత, లింగయ్య

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోధన రంగంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి బెస్ట్ టీచర్లుగా పలువురు ఎంపికయ్యారు. వీరికి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం చేతుల మీదుగా అవార్డుల ప్రదానం జరగనుంది. అవార్డులకు ఎంపికైన వారి వివరాలు ఇలా వున్నాయి..

తెలుగు వర్సిటీ నుంచి గడ్డం వెంకన్న...

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి గడ్డం వెంకన్న రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. వెంకన్న 30 ఏళ్లుగా గిరిజన విజ్ఞానపీఠంలో పరిశోధన బోధన నిర్వహిస్తున్నారు. 'పటం కథలు- కథకులు' అనే అంశంపై పరిశోధన గ్రంథంతో పాటు మరో 20 పుస్తకాలను వెలువరించారు.

పింగిళి కళాశాల నుంచి అరుణ...

వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి మహిళ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి మల్లారం అరుణ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికయ్యారు. కరీంనగర్‌కు చెందిన అరుణ 23 ఏళ్ల బోధన అనుభవం గడించారు. కరీంనగర్‌లో ప్రాథమిక, ఇంటర్, డిగ్రీ విద్యను అభ్యసించారు. కేయూ నుంచి ఎంఎస్సీ, పీహెచ్‌డీ సాధించారు. 2002లో జేఎల్‌గా ఎంపికై 2010లో డిగ్రీ లెక్చరర్‌గా పదోన్నతి సాధించారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి జర్నల్స్‌లో 25 పరిశోధన పత్రాలను వెలువరించారు. జిజ్ఞాస ప్రాజెక్టులో రాష్ట్ర ప్రథమ బహుమతి సాధించారు. అరుణ భర్త వాసం శ్రీనివాస్ గత ఏడాది రాష్ట్ర స్థాయి బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. భార్యాభర్తలిద్దరికీ ఉత్తమ టీచర్ అవార్డు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ప్రశాంతి, మల్లయ్య...

వడ్డెపల్లి ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అధ్యాపకురాలు ఎం.ప్రశాంతి, పరకాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ అధ్యాపకుడు ఎన్. మల్లయ్య రాష్ట్రప్రభుత్వ ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు.

కేడీసీ నుంచి గణ్‌సింగ్...

హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి బాటనీ విభాగం అధ్యాపకుడు ఎం.గణ్‌సింగ్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. గణ్‌సింగ్ గతంలో ఏటూరునాగారం, ఆదిలాబాద్ ప్రాంతాల్లో పనిచేశారు. హరితహారం ప్రోగ్రాం ఇన్‌చార్జిగా, స్పోర్ట్స్ ఇన్‌చార్జిగా, ఎన్ఎస్ఎస్ పీవోగా పనిచేశారు.

కేయూ నుంచి ప్రొఫెసర్ ప్రసాద్...

కాకతీయ యూనివర్సిటీ నుంచి ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొఫెసర్ ప్రసాద్ 2007లో కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా

(మిగతా 5లో..)

రికార్డుస్థాయిలో ఆదిదేవ లడ్డూ వేలం

రూ.4,76,116లకు దక్కించుకున్న ఎన్ఆర్ఐ మంచెన రామకృష్ణ



కేసముద్రం ఆదిదేవ లడ్డును దక్కించుకున్న మంచెన రామకృష్ణ సోదరులు శ్రీనివాస్, మనోహర్‌లను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు

6

మహిళలను కోటీశ్వర్లుగా చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పం

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో మహిళలను కోటీశ్వర్లును చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం కింద సికింద్రాబాద్ తండాకు చెందిన గుగులోతు మాలికి మంజూరైన సంచార చేపల విక్రయ వాహనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో వాహనానికి రూ.10 లక్షలు ప్రభుత్వం సమకూరుస్తుందని, కేంద్రానికి సంబంధించిన ప్రధాన మంత్రి మత్స్య యోజన పథకంతో అనుసంధానం చేసి 60 శాతం సబ్సీడీతో రూ.4 లక్షలకే మహిళా సంఘాలకు ఈ వాహనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. సబ్సీడీ మొత్తాన్ని కూడా బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలుగా సెర్ప్ ఇప్పిస్తుందని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల రమేష్, శంతన్‌రామరాజు, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, పద్మం ప్రవీణ్, నాజర్, నారాయణసింగ్, ఐకేపీ అధికారులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబు

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్. రమేష్‌బాబు అన్నారు. గురువారం కోర్టు ప్రాంగణంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, వివాహ, కుటుంబ తగాదా కేసులు, మెటర్ వెహికిల్ ఆక్సిడెంట్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు రాజీపడుటకు మార్గం సుగమం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంపై న్యాయవాదులు విస్తృత ప్రచారం నిర్వ హించి అధికంగా కేసులు రాజీ అయ్యేలా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎ. నాగరాజ్, జూనియర్ సివిల్ జడ్జి దిలీప్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రావణ్ రావు తదితరులు పాల్గొన్నారు

పేరూరు వద్ద నిలకడగా గోదావరి

యథావిధిగా అంతర్‌రాష్ట్ర రాకపోకలు



టేకులగూడెం వద్ద యథావిధిగా సాగుతున్న రాకపోకలు

వాజేడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలోని పేరూరు వద్ద గురువారం గోదావరి ప్రవాహం నిలకడగా ప్రవహిస్తోంది. ఉదయం 6గంటలకు 15.380 మీటర్లతో నీటిమట్టం నమోదు కాగా 7గంటలకు 15.360 మీటర్లకు చేరుకుంది. సాయంత్రం 5గంటల వరకు 15.360 మీటర్లతో నిలకడగా ఉంది. ఈ నేపథ్యంలో రెండు రోజులపాటు టేకులగూడెం వద్ద నిలిచిపోయిన అంతర్ రాష్ట్ర రాకపోకలు గురువారం నుంచి యథావిధిగా కొనసాగాయి. పేరూరు-చంద్రుపట్ల మధ్య మరిమాగు వాగు ఉధృతి కాస్తంత తగ్గగా రాకపోకలు సాగుతున్నాయి.

రావి ఆకుపై 'సర్వేపల్లి'

యువ ఉపాధ్యాయుడి సృజనాత్మకత

ఉపాధ్యాయ దినోత్సవం రోజున రావి ఆకుపై సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్మరించుకుంటూ యువ ఉపాధ్యాయుడు చిత్రాన్ని చెక్కాడు. కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని అమినాపురానికి చెందిన లింగాల నిఖిల్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొద్దినెలల క్రితమే కొలువులో చేరాడు. ఆకుపై ఉన్న అవరోధాలను అధిగమించి సంక్లిష్టంగా ఉన్న చిత్రాన్ని చెక్కడంపై సూక్ష్మకళలో ఆయన ప్రదర్శించిన సృజనాత్మకతను పలువురు అభినందిస్తున్నారు.

-కేసముద్రం (ఆంధ్రజ్యోతి)



రావి ఆకుపై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రం

'ఓపెన్'గా చదివేయండి

బడికి వెళ్లి చదవలేక పోయిన వారికి సువర్ణావకాశం

టెన్త్, ఇంటర్ పరీక్షలు ఓపెన్ స్కూల్‌లో రాసుకోవచ్చు

దరఖాస్తులకు 7న చివరి గడువు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో రెగ్యులర్‌గా బడికి వెళ్లి చదువుకోలేక పోయిన వారికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సిస్టం(టాస్) అండగా నిలుస్తోంది. బడికి వెళ్లకుండానే వారి పని, వృత్తులు, ఉద్యోగాలు వారు చేసుకుంటూనే నేరుగా టెన్త్, ఇంటర్ పరీక్షలు రాసుకునే అవకాశం కల్పిస్తోంది. 15ఏళ్లు దాటిన వారు టెన్త్, టెన్త్ పాసైనవారు ఇంటర్ పరీక్షలకు హాజరు కావచ్చు. కారుణ్య నియామకాల కోసం, ఉద్యోగాల్లో పదోన్నతి కోసం ఎదురు చూస్తున్న వారికి ఈ విధానం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. టెన్త్, ఇంటర్ మధ్యలో మానేసిన వారికి, ఫెయిల్ అయిన వారికి, మధ్యలో చదువు మానేసిన వారికి ఇది సదవకాశం కల్పిస్తోంది. అంతేకాకుండా రాష్ట్రంలో అక్షరాస్యతా శాతం, ఉన్నత విద్యావంతుల శాతం పెంచడానికి టాస్ దోహదం చేస్తోంది. మహిళలు, పలు వృత్తి, వ్యాపార రంగాల్లో ఉన్న వారికి, ఉద్యోగులకు, సామాజిక, ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు విద్యార్హతలు పెంచుకునే అవకాశం కల్పిస్తున్నది.

టాస్‌తో వెసులుబాటు

ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఎలాంటి గరిష్ట వయో పరిమితి లేదు. రెగ్యులర్‌గా టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ ఐనా పాస్ ఐన 2 సబ్జెక్టులు బదలాయించుకుని టాస్ పరీక్షలు రాయొచ్చు. ఇష్టమైన 5 సబ్జెక్టులతో కోర్సు పూర్తి చేయవచ్చు. వృత్తి విద్య ఒక సబ్జెక్టుగా ఎంచుకునే వీలుంది. మహిళలు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు, మాజీ సైనికోద్యోగుల పిల్లలకు ఫీజులో రాయితీలు కల్పిస్తున్నారు. అడ్మిషన్ తీసుకున్న 5 ఏళ్లలో కోర్సు పాస్ కావాల్సి ఉంటుంది. ఆ తర్వాత మళ్లీ అడ్మిషన్ తీసుకోవాలి. రెగ్యులర్‌గా టెన్త్ పాసైన వారు ఓపెన్ ఇంటర్ రాయాలంటే ఒక ఏడాది గ్యాప్ ఉండాలి.



టాస్ ఎంబ్లమ్

ఈనెల 7 చివరి తేదీ

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు రాయడానికి దరఖాస్తులు సమర్పించడానికి ఈనెల 7చివరి తేదీకి పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. గతంలో ఈ గడువు జూలై 31 కాగా దానిని ఆగస్టు నెలాఖరుకు పొడిగించారు. ఇప్పుడు మరోసారి పొడిగించడం గమనార్హం. నిర్ధేశిత ఫీజు చెల్లింపుకు గడువు 7, కాగా ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించడానికి 8 నుంచి 20వ తేదీ వరకు చెల్లించవచ్చు.



ఓపెన్‌లో చదివే వారికి అందించే పుస్తకాలను చూపుతున్న సిబ్బంది

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ చదివి ప్రతీ ఒక్కరు విద్యార్హతలు పెంచుకోవాలి. ప్రభుత్వం ప్రతీ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓపెన్ స్కూల్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో మొత్తం 23 ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. దరఖాస్తుదారులు అందుబాటులో ఉన్న కేంద్రాలను వివరాల కోసం సంప్రదించవచ్చు.

- మురారి శంకర్ రావు, ఓపెన్ స్కూల్ జనగామ జిల్లా కో ఆర్డినేటర్

నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారిస్తా

వరంగల్ ఎంపీ కడియం కావ్య

రూ.90లక్షల విలువచేసే 9 ప్రొసీడింగ్ కాపీల అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని కుల సంఘాల, మహిళా సంఘాల కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు సంబంధించిన ఎంపీ నిధులతో వచ్చిన రూ.90లక్షల విలువచేసే 9 ప్రొసీడింగ్‌లను ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి అందించారు. ఆమె మాట్లాడుతూ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అనేకమార్లు కేంద్ర మంత్రులను కలువడం జరిగిందన్నారు. జాతీయ రహదారి పెండింగ్ పనులను పూర్తి చేయాలని, స్టేషన్‌ఘన్‌పూర్‌లో పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ ఇవ్వాలని, ప్రసాద్ పథకం క్రింద చిలుపూరు బుగులు వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని చేర్చాలని మంత్రులను కలిసి కోరినట్లు తెలిపారు. కార్య క్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్యాశిరీష్ రెడ్డి, పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యలు తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీ ఆవరణలో ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా రాజమ్మ అనే మహిళా ఏర్పాటు చేసుకున్న వనిత టీ స్టాల్‌ను వారు కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ లావణ్యాశిరీష్ రెడ్డి, ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీఆర్డీవో పీడీ వసంత, డీపీఎం సతీష్, మండలసమాఖ్య అధ్యక్షురాలు బేతి మంజుల, నాయకులు బెలిదె వెంకన్న, శిరీష్‌రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, అంబటి కిషన్‌రాజు, మంతెన ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.



కమ్యూనిటీ భవనాల ప్రొసిడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

ఆశ్రమ పాఠశాల నుంచి పరారైన బాలుడు

● అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పత్తిపాక నందు ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల నుంచి పారిపోయిన ఓ బాలుడిని వరంగల్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని గురువారం చైల్డ్ వెల్ఫేర్ వరంగల్ వారికి అప్పగించారు. వరంగల్ జీఆర్పీ ఇన్‌చార్జి ఇనిస్పెక్టర్ వి.నరేష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం, బొల్లికొండ గ్రామానికి చెందిన నేతావత్ నరేష్ అనే బాలుడు మహబూబాబాద్ పట్టణంలోని పత్తిపాక నందు ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి విద్యాభ్యాసం చేస్తున్నాడు. చదువుకునేందుకు ఇష్టం లేక ఆశ్రమ పాఠశాలలో ఉండలేక తల్లిదండ్రులకు చెప్పుకోలేక మానుకోట రైల్వే స్టేషన్‌లో ఓ గుర్తుతెలియని రైలు ఎక్కి వరంగల్ రైల్వే స్టేషన్‌లో దిగాడు. ప్లాట్‌ఫాం-4పై పెట్రోలింగ్ చేస్తున్న రైల్వే కానిస్టేబుళ్లు ఎస్.రవీందర్, ఎస్‌కె పాషా, ఎం.నాగరాజు, ఈ బార్గవిలకు కనిపించడంతో బాలుడిని చేరదీసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనర్ బాలుడు కావడంతో సంరక్షణ, భద్రత కోసం వరంగల్ చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఆదివాసీ లిబరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుమన్

ఏటూరునాగారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7న నిర్వహించే ఆదివాసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ లిబరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దబ్బకట్ల సుమన్ కోరారు. ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ పాలనా వ్యవస్థ, లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే అంశంపై చర్చించేందుకు ములుగు జిల్లాలోని ఆదివాసీ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణే లక్ష్యమన్నారు.

ఈ సమావేశం ఏటూరునాగారంలోని గిరిజన భవన్‌లో జరగనుందన్నారు. ఉద్యోగ, విద్యార్థి, కార్మిక, కర్షక, నిరుద్యోగ, మహిళా సంఘాల ప్రతినిధులు, కవులు, కళాకారులు, మేధావులు, అడ్వకేట్లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టింగ బుచ్చయ్య, ఈసం రాజు, కొమురం లక్ష్మీకాంత్, లోడిగా బుల్లి, తాటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిర్లక్ష్యంతోనే యూరియా కొరత

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వల్లే దేశమంతటా యూరియా కొరత ఏర్పడిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు విమర్శించారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన మూడు ఇందిరమ్మ ఇళ్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉండి అందినకాడికి దోచుకుందే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. అప్పుడు దోచుకున్న కోట్ల రూపాయలను పంచుకొనే క్రమంలో సఖ్యత కుదరక ఆ పార్టీ నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. అలాంటి పార్టీ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే స్థాయి లేదని దుయ్యబట్టారు. పదేళ్ల కాలంలో ప్రతి పేదవాడికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మిస్తామని మాటు చెప్పారే గానీ చేతల్లో ఎక్కడా చూపలేదని విమర్శించారు. మొక్కుబడిగా ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు కుక్కలకు, పందులకు ఆవాసాలుగా మారాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని అన్నారు. 2028 డిసెంబరులోగా 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను కట్టించి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీవో సురేష్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

యూరియా లేక.. సాగుబడి చేయలేక

● బయ్యారంలో పురుగు మందు డబ్బాతో రైతుల నిరసన

బయ్యారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పది రోజుల నుంచి తిరుగుతున్నా ఒక్క బస్తా యూరియా దొరికన పాపాన పోలేదు.. పొద్దస్తమానం పడిగాపులు కాసినా యూరియా దొరుకుతుందనే గ్యారెంటీ లేదు.. ఇప్పటికే పంట అదునుతప్పుతోంది.. యూరియా దొరకనప్పుడు సాగుబడి చేస్తేంత.. చేయక పోతేంత.. అంటూ ఆందోళనకు గురైన ఇరువురు రైతులు గురువారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో పురుగుల మందు డబ్బాతో నిరసనకు దిగిన ఘటన ఉద్రిక్తలకు దారితీసింది. బయ్యారం పీఏసీఎస్ సొసైటీ కార్యాలయం ఎదుట ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై రైతులు యూరియా కోసం స్వచ్ఛందంగా రాస్తారోకో చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న చోక్లాతండాకు చెందిన మాలోత్ బావ్‌సింగ్, జగ్నతాండాకు చెందిన ఇస్లావత్ లఘుపతి అనే ఇరువురు రైతులు రోడ్డుపై పురుగుల మందు డబ్బాతో పడుకొని నిరసన తెలపడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు ఎక్కడ అఘాయిత్యానికి పాల్పడుతారోననే టెన్షన్ నెలకొన్నది. ఈ క్రమంలోనే ఆందోళన చేస్తున్న పలువురు రైతులు పురుగు మందు డబ్బా తొలగించడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు



పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న రైతులు

గంజాయి రవాణా చేస్తున్న యువకుడి అరెస్టు

ములుగు టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గంజాయిని రవాణా చేస్తున్న యువకుడిని పోలీసులు ములుగు జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద తనిఖీలు చేస్తుండగా నంబర్ ప్లేట్‌లేని బైక్‌పై ఇంచర్ల గ్రామానికి చెందిన లద్దునూరి పవన్ అనే యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడని ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలి పారు. అతడిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 365 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ సిలేరు నుంచి ఇంచర్లకు గంజాయిని తీసు కొచ్చి విక్రయిస్తున్నాడని తమ విచారణలో తేలిందని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, గంజాయిని స్వాధీ నం చేసుకున్నామని ఎస్సై చెప్పారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణమూర్తి గురువారం తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం, గురుపూజోత్సవం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ విద్యారంగ అభివృద్ధి, పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్న 12 మంది ఉపాధ్యాయులను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికచేశామని పేర్కొన్నారు. వీరిని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మురళీనాయక్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రజాప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులుగా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్లు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఇసుక లారీ ఢీకొని బాలుడి మృతి

● ములుగు జిల్లాలో ఘటన



హర్షసాయి (ఫైల్)

గోవిందరావుపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇసుక లారీ ఢీకొని బాలుడు మృతిచెందిన సంఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో గురువారం జరిగింది. మండలంలోని పస్రాకు చెందిన కుప్పనూటి వీరబాబు తన పెద్దకుమారుడు హర్షసాయి(4)తో కలిసి మోటార్ సైకిల్‌పై గోవిందరావుపేటకు వచ్చాడు. నూతనంగా నిర్మిస్తున్న ఇంటికోసం ఇటుకలను కొనుగోలు చేసేందుకు వ్యాపారితో మాట్లాడేందుకు షాపు ఎదుట బైక్‌ను ఆపాడు. కుమారుడు హర్షసాయిని బైక్‌పైనే కూర్చో బెట్టి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత ఆ బాలుడు బైక్‌దిగి తండ్రి దగ్గరికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ఏటూరునాగారం నుంచి హైదరాబాద్ వైపు ఇసుక లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. లారీ టైర్లు బాలుని పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహం ఛిద్రమైపోయింది. కళ్లెదుటే కుమారుడు మరణించడంతో తండ్రి వీరబాబు కన్నీరు మున్నీరయ్యాడు. పస్రా ఎస్సై కమలాకర్ ఘటనా స్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

డ్రైవర్ సమయ స్ఫూర్తితో తప్పిన ప్రమాదం

వర్ధన్నపేట సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో గురువారం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై గ్రానైట్ లారీ డ్రైవర్ సమయ స్ఫూర్తితో పెను ప్రమాదం తప్పింది. కరీంనగర్ నుంచి ఒడిశాకు గ్రానేట్ లోడ్‌తో వెళుతున్న లారీ డ్రైవర్ అజారోద్దిన్‌కు అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చింది. ఆ డ్రైవర్ సమయ స్ఫూర్తిగా వ్యవహరించి లారీని రోడ్డు పక్కన నిలపడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. లారీ డ్రైవర్ అజారోద్దిన్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించడంతో అతని పరిస్థితి నిలకడగా ఉంది.



మీ-సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న దేవేందర్

ఎక్కువ రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు

ఏటూరునాగారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత రుసుము కంటే ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మీ-సేవ కేంద్రాల నిర్వాహకులను ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ హెచ్చరించారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని మీ-సేవ కేంద్రాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీ-సేవ కేంద్రాల నిర్వాహకు లకు పలు సూచనలు చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి ఈఎస్‌డీ మార్గదర్శకాల ప్రకారం సెంటర్లను నడపాలని ఆదేశించారు. దరఖాస్తుదారుల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక రుసుము వసూలు చేయకూడదన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా మీ-సేవ మేనేజర్ పోలోజు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7510	5300
మక్కలు	2159	1521
కందులు	5622	3022
పెసళ్లు	5950	3022
పల్లికాయ (సూక)	6100	3500
పల్లికాయ (పచ్చిది)	4700	2400
పసుపు (కాడి)	12356	7889
పసుపు (గోల)	10509	8996
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	15000	12000
యూఎస్341ఏసీ	14800	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

గణపతి శోభాయాత్రకు పకడ్బందీ ఏర్పాట్లు

నిమజ్జన కేంద్రాలు, ఊరేగింపు మార్గాలు, జంక్షన్లలో పటిష్ఠ బందోబస్తు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం (నేడు) నిర్వహించనున్న గణపతి శోభాయాత్ర జరిగే మార్గాలతో పాటు నిమజ్జన ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీస్‌శాఖ పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో కొలువుదీరిన 6,683 విగ్రహాల నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్లలో 2,100 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది సేవలను పోలీస్‌శాఖ వినియోగించుకోబోతుండగా వరంగల్ గ్రేటర్‌కు వచ్చే సరికి 1600 మంది సిబ్బందిని రంగంలోకి దింపనున్నారు.


హనుమకొండ సిద్దేశ్వరాలయం వద్ద గణేషుడి నిమజ్జనానికి చేస్తున్న ఏర్పాట్లు

కట్టుదిట్టమైన నిఘా

గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించిన మండపం నుంచి నిమజ్జనం చేసే చెరువు వరకు అడుగడుగునా యాత్రలను పరిశీలించేందుకు పోలీస్ సిబ్బందే కాకుండా సీసీ కెమెరాలు, డ్రోన్లతో పరిశీలించేందుకు పోలీస్ శాఖ ఏర్పాట్లను చేసింది. పోలీస్ శాఖతో పాటు ఎన్‌సీసీ, ఎన్‌ఎస్ఎస్ వలంటీర్ల సేవలను సైతం శోభాయాత్రలో వినియోగించుకోనున్నారు. కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్లలో కలిపి నలుగురు డీసీపీలు, ఇద్దరు అదనపు డీసీపీలు, 15 మంది ఏసీపీలు, 53 మంది ఇన్‌స్పెక్టర్లు, 70 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్, హోంగార్డులు కలిపి 2,100 మంది కలిపి బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు. గ్రేటర్ వరంగల్‌లోని ట్రైసిటీ పరిధిలోకి వచ్చే సరికి శోభాయాత్రతో పాటు 22 నిమజ్జన కేంద్రాల వద్ద 1600 మంది పోలీసులు బందో బస్తు నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసులు వివిధ జంక్షన్‌లతో పాటు శోభాయాత్ర మార్గాల్లో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ డైవర్షన్ మార్గాల్లో విధులు నిర్వహించనున్నారు. రెండు రోజుల ముందే సిటీ నుంచి బయటికి వెళ్లే మార్గాలతో పాటు బయటి నుంచి సిటీకి వచ్చే డైవర్షన్ మార్గాలను పోలీస్‌శాఖ వెల్లడించింది.


చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద వినాయకుడి నిమజ్జనానికి చేస్తున్న ఏర్పాట్లు

మఫ్టీలో గస్తీ...

విగ్రహాలన్నీ ఒకేరోజు నిమజ్జనం చేస్తుండడంతో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులతో రోడ్లన్నీ కిక్కిరిసిపోనున్నాయి. దీంతో మహిళలను వేధించడం, చోరీలు, మత ఘర్షణలకు చోటు చేసుకోకుండా పోలీస్‌శాఖ అనుమానాస్పద వ్యక్తుల కదలికలను కనిపెట్టేందుకు ఎస్బీ, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, షీటీమ్, ఇతర ప్రత్యేక విభాగాలతో గస్తీ కాసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేకంగా పెట్రోలింగ్ చేసేందుకు సిబ్బందిని ఏర్పాటు చేసింది. నిమజ్జనంలో ఎలాంటి నిబంధనలు పాటించాలనేది ఇప్పటికే పోలీస్‌శాఖ ఆయా ఉత్సవ కమిటీలకు సూచించింది. నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకునేందుకు సైతం పోలీస్‌శాఖ సిద్ధమైంది. ప్రార్థన మందిరాల ఎదుట శోభాయాత్ర చాలా సమయం వేచిచూడకుండా, పెద్ద, పెద్ద శబ్దాలతో డీజే లను ఏర్పాటు చేయకుండా ఉండేందుకు పోలీస్‌శాఖ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఆదేశాలు ధిక్కరించి డీజేలను ఏర్పాటు చేస్తే సీజ్ చేసి కేసులు నమోదు చేసేందుకు ప్రణాళిక రచించింది.

అందరూ సహకరించాలి
వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

ప్రశాంత వాతావరణంలో గణపతి నిమజ్జనం విజయవంతంగా ముగిసేందుకు అందరూ పోలీస్‌శాఖకు సహకరించాలి. అత్యవసరం అనుకుంటే సత్వరమే డయల్ 100 ను సంప్రదించాలి. పోలీస్ శాఖ సూచించిన మార్గాల్లోనే వాహనదారులు ప్రయాణించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలి. మద్యం తాగి ఊరేగింపులో పాల్గొనవద్దు. అలాంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలుంటాయి. డీజేలు పూర్తిగా నిషేధం, ఆడియో సిస్టం నిర్ణీత స్థాయిలో ఉపయోగించాలి.


బంధం చెరువు వద్ద రోడ్డుకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

కేయూ ప్రతిష్ఠను విశ్వవ్యాప్తం చేస్తాం

- ఫార్మసీ కళాశాల గొప్పతనాన్ని కాపాడాలి
- వైస్ చాన్స్‌లర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- ఫార్మసీ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేయూ ప్రతిష్ఠను విశ్వవ్యాప్తం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామని కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కేయూ ఫార్మసీ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. కేయూ సెనెట్ హాల్‌లో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేయూలో ఫార్మసీ కళాశాల గొప్పతనాన్ని ప్రశంసించారు. స్ఫూర్తిదాయకమైన అధ్యాపకులు, విద్యార్థులు ఫార్మసీ కళాశాలలో ఉన్నారని పేర్కొన్నారు. కళాశాల గ్లోరిని కాపాడాలని పిలుపునిచ్చారు. కేయూ గోల్డెన్ జూబ్లీని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. హైదరాబాద్, అమెరికాలోనూ కేయూ గోల్డెన్‌జూబ్లీ ముగింపు సంబురాలను నిర్వహిస్తామన్నారు. ఫార్మసీ కళాశాలలో మంచి పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు. 40 శాతం రూసా నిధులను ఫార్మసీ కళాశాలకు కేటాయించినట్లు ఆయన తెలిపారు. అకాడమిక్ అంశాలతో గొప్పతనం లభిస్తోందన్నారు. ఇండస్ట్రీ ఎక్స్‌ప్లోజర్ కావాలని అన్నారు. అల్యూమీ విద్యార్థులందరూ కళాశాలలో ఉండాలని అన్నారు. అల్యూమీ విద్యార్థుల సహకారం వృథా కాదన్నారు. కాంట్రిబ్యూషన్‌ను టీచింగ్, ల్యాబ్, ఎండోమెంట్, ట్రైనింగ్‌తో పాటు మౌలిక వసతులు, ప్రయోగశాలలో సహకరించాలని కోరారు.


ఫార్మసీ కళాశాల వేడుకల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, డీన్ సమ్మయ్య తదితరులు

రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. కేయూకు వన్నెతెచ్చింది ఫార్మసీ కళాశాల అని అన్నారు. మంచి పరిశోధనలు జరగాలని, నాటి అధ్యాపకులను, గొప్ప పరిశోధకులను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కేయూ ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య మాట్లాడుతూ.. తన అభివృద్ధికి తన టీచర్ల ప్రోత్సాహమే ప్రధానమన్నారు. రిటైర్డు ప్రొఫెసర్ ఫార్మసీ కళాశాల తొలి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పరమేశ్వర్ మాట్లాడుతూ.. కేయూ ఫార్మసీ కళాశాల ఎంతోమంది గొప్పవారిని అందించిందన్నారు. కేయూ తొలి వీసీ ప్రొఫెసర్ వెంకట్రామయ్య ఫార్మసీ కళాశాల అభివృద్ధికి చొరవ తీసుకున్నారని గుర్తు చేశారు. గత వీసీలు జాఫర్‌నిజాం, వాసుదేవ్, జయశంకర్‌లు సహకరించారని అన్నారు.


హాజరైన ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థులు

ప్రొఫెసర్ రామ్ బహు మాట్లాడుతూ.. ఫార్మసీ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉనాయని అన్నారు. ఇండియన్ ఫార్మసీ కాంగ్రెస్, మెడ్యూలర్ ల్యాబ్‌లను నిర్వహించేందుకు కృషి జరగాలని అన్నారు. ప్రొఫెసర్ ఏవీఎన్ అప్పారావు మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు, అధ్యాపకులందరూ కళాశాలకు రుణపడి ఉంటారని అన్నారు.

ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. కేయూఫార్మసీ కళాశాల గొప్ప టీచింగ్, రిసెర్చ్‌లను అందించిందన్నారు. కేయూ ఫార్మసీ కళాశాల అల్యూమీ వైస్ ప్రెసిడెంట్ ఏవీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమం కోసం అల్యూమిని పనిచేస్తోందన్నారు. హైదరాబాద్ యూరో ఇంటర్నేషనల్ లిమిటెడ్ అధినేత జే.రాజమౌళి మాట్లాడుతూ.. కేయూ ఫార్మసీ కళాశాల ఏర్పాటుకు పోరాటాలు చేశామని మైలురాళ్ళను సాధించమని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కేయూఫార్మసీ అల్యూమినీ సభ్యులున్నారన్నారు. ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. వర్సిటీలో గొప్ప విభాగం ఫార్మసీ అని కొనియాడారు. ప్రొఫెసర్ వై. నరసింహరెడ్డి మాట్లాడుతూ.. కళాశాల అంచెలంచెలుగా ఎదిగిందన్నారు. రిటైర్డు ప్రొఫెసర్లు ఎం.సారంగపాణి, ఫార్మసీ ప్రిన్సిపాళ్ల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పూర్వ ప్రొఫెసర్లను సన్మానించారు.

భళా పోలీస్!

- ప్రశాంతంగా యూరియా పంపిణీ
- ఆధార్ కార్డుల వరుస క్రమంలో రైతులకు అందజేత


తమ గ్రామాల్లోనూ యూరియా పంపిణీ చేయించాలని ఎస్సై రఘుపతిని కోరుతున్న రైతులు

ఖానాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రాత్రంతా క్యూలో కంటిమీద కునుకులేకుండా పడిగాపులు కాస్తున్న రైతులకు పోలీసుల చొరవ రైతులకు సంతృప్తి కలిగించింది. పోలీసులు సందర్భానుసారంగా వ్యవహరించిన తీరు రైతులను ఇంటికెళ్లి నిద్రించేలా చేసింది. ఖానాపురం మండలం రామలింగయ్యపల్లె సొసైటీ ఎరువుల గోదాము వద్ద బుధవారం రాత్రి 8 గంటల నుంచే వందలాది మంది రైతులు, మహిళలు యూరియా కోసం క్యూ కట్టారు. రాత్రంతా అక్కడే నిద్రించడానికి సిద్ధమై వచ్చారు. సమాచారం తెలుసుకున్న దుగ్గొండి సీఐ సాయిరమణ, ఎస్సై రఘుపతి రాత్రి 1 గంటకు రైతుల వద్దకు వెళ్లారు. వారికి నచ్చజెప్పి ఇక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. అయినా రైతులు ససేమిరా అనడంతో పోలీసులు సమయోచితంగా వ్యవహరించారు. రైతుల ఆధార్ కార్డులను సీరియల్‌గా తీసుకుని ఇదే ప్రకారంగా యూరియా అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు అంగీకరించి అర్ధరాత్రి అక్కడి నుంచి ఇళ్లకు వెళ్లిపోయారు. గురువారం ఉదయం ఎస్సై రఘుపతి ఆధార్ కార్డుల సీరియల్ ప్రకారం దగ్గరుండి యూరియా పంపిణీ చేయించారు. దీంతో పలువురు రైతులు ఎస్సై రఘుపతికి కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామాల్లోనూ ఇలాగే పంపిణీ చేయాలని కోరారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ రైతులు సంయమనం పాటించాలని కోరారు. ఎలాంటి అవకతవకలు లేకుండా రైతులకు సక్రమంగా యూరియా అందిచేందుకు కృషి చేస్తామన్నారు.

చదువుల దివిటీ గురువు

- నేడు ఉపాధ్యాయ దినోత్సవం
- పాఠశాలలు, కళాశాలల్లో గురు పూజోత్సవం
- ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమాలకు ఏర్పాట్లు
- మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని వేడుకలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అజ్ఞానమనే చీకటిలో ఉన్నవారికి, విజ్ఞానమనే దారిని చూపి వారి జీవితాల్లో వెలుగులు నింపే వారే ఉపాధ్యాయులు. గురువు అనుగ్రహం కలిగిన నాడు అజ్ఞాని కూడా జ్ఞానవంతుడు అవుతాడు. ఏటా సెప్టెంబరు 5న మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మన జీవితాల్లో వెలుగులు నింపుతున్న టీచర్ల సేవలను గుర్తు చేసుకుంటూ టీచర్స్ డే జరుపుకుంటారు. అక్టోబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా టీచర్స్ డేను జరుపుకుంటుండగా, భారతదేశంలో మాత్రం సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించుకోవడం జరుగుతోంది.

పాఠశాలలు, కళాశాలల్లో వేడుకలు

1962వ సంవత్సరం నుంచి సెప్టెంబర్ 5న ప్రతీ ఏటా సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజున ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఆ రోజు విద్యా బోధన చేసిన గురువులను గుర్తు చేసుకోవడంతో పాటు ఘనంగా సన్మానిస్తారు. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసి వారు ఉన్నతంగా ఎదగడానికి తోడ్పాటు నందించిన గురువులను గుర్తు చేసుకుంటూ పూజిస్తారు. శుక్రవారం ప్రాథమిక పాఠశాలలు మొదలు కొని ఉన్నత కళాశాలల వరకు ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు తమకు విద్యా బుద్ధులు నేర్పుతున్న గురువులకు మనసారా వందనం సమర్పించడానికి సిద్ధమవుతున్నారు.

ఉప రాష్ట్రపతి, రాష్ట్రపతిగా..

సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజునే ఎందుకు టీచర్స్ డేగా జరుపుకుంటారనేది చాలా మంది మనసులోని ప్రశ్న. సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత దేశ తొలి ఉపరాష్ట్రపతి, రెండో రాష్ట్రపతిగా పని చేశారు. 1888లో తిరుత్తణిలో ఆయన జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ నుంచి ఫిలాసఫీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. కలకత్తా, మైసూర్ యూనివర్సిటీలో ఆయన లెక్చరర్‌గా పనిచేశారు. చాలా మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు.

వేడుకలు వద్దన్న గురువు

ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన రాధాకృష్ణన్ ఏ రోజు తన పుట్టిన రోజును జరుపుకోవాలని కోరుకోలేదట. విద్యార్థులు ఎవరైనా పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తామని అడిగితే వద్దని వారించే వారట. విద్యార్థులు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శించే ఆయన, విద్యార్థులు గురువుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని చెప్పేవారట.


సర్వేపల్లి రాధాకృష్ణన్

అందుకే ఆయన పుట్టిన రోజున అందరూ ఉపాధ్యాయులను గౌరవిస్తూ టీచర్స్ డే వేడుకలను జరుపుతున్నారు. నాటి నుంచి నేటి వరకు ఆనవాయితీగా వస్తుంది.

గొప్ప పండితుడు

భారతదేశంలో ఆనాడు ఉన్న మత ఆధ్యాత్మిక పునరుద్ధరణ వాదాన్ని అకాడమిక్ తాత్విక స్థాయికి తీసుకువెళ్లిన గొప్ప పండితుడు సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన 15 సార్లు నోబెల్ సాహిత్య బహుమతి, 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. రాధాకృష్ణన్‌ను గురువులకే గురువుగా భావించేవారు. సర్వేపల్లి తనకు కృష్ణుడితో సమానమని జాతిపిత మహాత్మా గాంధీ కీర్తించారు. యుగ పురుషుల గురించి ఉపన్యాసం ఇవ్వండి అని పిలిస్తే యుగపురుషుడే వచ్చారు అని సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఉద్దేశించి కీర్తించారు హోవెల్. 'నాలో మామూలు మనిషిని దర్శించిన మహర్షి' అంటూ సోవియట్ అధినేత స్టాలిన్ రాధాకృష్ణన్ గొప్పతనాన్ని చెప్పారు.

ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లా పరిధిలోని 6 విభజిత జిల్లాల్లో శుక్రవారం ఘనంగా జరుపుకునేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ గురువులను అధికారికంగా సత్కరించనున్నారు. అలాగే పాఠశాలల్లోనూ దినోత్సవాన్ని జరుపుకోనున్నారు.

మామునూరు ఎయిర్‌పోర్ట్‌పై సమీక్ష

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇంజనీరింగ్ బృందం ఢిల్లీ నుంచి గురువారం వచ్చి మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను ప్రిలిమినరీ సర్వేలో భాగంగా పరిశీలించారు. అనంతరం బృందం సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సత్యశారదతో కలిసి ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి కోసం గుర్తించిన ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఏఏఐ ఏజీఎంలు నటరాజ్, మనీష్ జోన్వాల్, మేనేజర్లు ఓంప్రకాశ్ రోషన్ రావత్, ఎన్‌పీడీసీఎల్, ఇరిగేషన్ ఎస్‌ఈలు గౌతమ్‌రెడ్డి, రాంప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్షలో పాల్గొన్న వరంగల్ కలెక్టర్, ఇతర అధికారులు

గురువులకు జేజేలు..

3వ పేజీ తరువాయి

నియమితులయ్యారు. 2019లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2021లో ప్రొఫెసర్‌గా పదోన్నతి సాధించారు. ప్రసాద్ గతంలో వర్సిటీ హాస్టల్స్ జాయింట్ డైరెక్టర్‌గా, డైరెక్టర్‌గా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, బీవోఎస్‌గాను సేవలందించారు. ఐపీఆర్ సెల్ నోడల్ ఆఫీసర్, ఆర్గోయూ కేంద్రమెంబర్ ఇన్‌చార్జిగా పనిచేశారు. 60 అంతర్జాతీయ జర్నల్స్‌తో పాటు మొత్తంగా 86 పరిశోధన పత్రాలను ప్రచురించారు. 12 పేటెంట్‌లు క్యాన్సర్ బయాలజీపై పొందారు.

హిందీ టీచర్ చెడిపాక రాములు

వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా నుండి హిందీ స్కూల్ అసిస్టెంట్ చెడిపాక రాములు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక య్యారు. ప్రస్తుతం లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పనిచేస్తున్నారు. గత 23 ఏళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే సినిమా పాటలు, జానపదాలు రాస్తున్నారు. మూడు సినిమాలతో పాటు 14 ప్రైవేటు ఆల్బమ్‌లకు జానపద గీతాలు రాశారు.

ఫిజికల్ డైరెక్టర్ లింగయ్య

చిట్యాల (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని జడల్‌పేటలోని జడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నూకల లింగయ్య రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా లింగయ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసంతి, ఉపాధ్యాయులు, ఎ పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సాంబమూర్తి అభినందించారు.

మహబూబాబాద్ జిల్లా నుంచి సునీత

మహబూబాబాద్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బయాలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న సునీత రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపు, పాఠశాలల బలోపేతం మొదలగు అంశాలకు సంబంధించి ఆమె ఉత్తమ పనితీరు కనబరిచారు. జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణమూర్తి ఆమెను అభినందించారు.

2009 డీఎస్సీలో బయోలాజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ నియామకమైన సునీత మరిపెడ మండలం వీరారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 18 నెలలు విధులు నిర్వహించారు. అనంతరం 2011లో కురవి మండలం నేరడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 13 సంవత్సరాలు విధులు నిర్వహించారు. 2023లో జిల్లా కేంద్రంలోని కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఆమె ఎస్సీఈఆర్టీ నిర్వహించే సెమినార్లకు నేటి వరకు ఐదు సార్లు పరిశోధన తాఅత్రలను సమర్పించారు. కరోనా సమయంలో విద్యార్థులకు యూట్యూబ్ ద్వారా పాఠ్యాంశాలను బోధించారు. జిల్లాస్థాయి సైన్స్‌ఫేయిర్, సైన్స్ స్కిట్స్ పోటీల్లో పలుమార్లు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు.

ప్రీ ప్రైమరీ టీచర్ పోస్టులపై ప్రచారమేదీ?

- నోటిఫికేషన్‌పై నిరుద్యోగులకు అందని సమాచారం
- అర్హతలున్నా దరఖాస్తు చేసుకోలేకపోయామని ఆవేదన
- గడువు పెంచాలని నిరుద్యోగుల వినతి

హనుమకొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక (ప్రీ స్కూల్) తరగతులకు తాత్కాలిక ప్రాతిపదికపై ఇన్‌స్ట్రక్టర్, ఆయాలను నియమించే ప్రక్రియ గందరగోళంగా మారింది. నియామకాలపై తగినంత ప్రచారం చేయకపోవడం వల్ల ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకోలేక పోయారు. సాధారణంగా ఏదైనా ఉద్యోగ ప్రకటన అయిన జారీ చేసినప్పుడు అందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం కల్పిస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి గరిష్టంగా పక్షం రోజులు, అవసరమైతే అంతకన్నా ఎక్కువ సమయం ఇస్తారు. కానీ ఇందుకు విరుద్ధంగా ఇన్‌స్ట్రక్టర్, ఆయాల భర్తీ ప్రక్రియ ఉంది. ఉద్యోగ నియామక ప్రకటనను విద్యాశాఖ జారీ చేసినప్పటికీ అది ఎక్కువ మందికి తెలియదు. కేవలం పత్రికలకు ప్రకటన రూపంలో ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఏ సామాజిక మాధ్యమాల్లోనూ కనిపించలేదు. ప్రచారమూ కాలేదు. దీంతో చాలా మంది విద్యావంతులైన నిరుద్యోగులకు తెలియకుండా పోయింది.



జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి నోటిఫికేషన్ జారీ చేయడమే కాకుండా, మండల స్థాయిలో ఎక్కువ మందికి తెలిసే ప్రచారం కల్పించాల్సిందిగా ఎంఈవోలకు ఆదేశాలు ఇచ్చినట్టు జిల్లా విద్యాశాఖాధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణలో అది ఎక్కడా కనిపించలేదు. ఎంఈవోలు ఈ నోటిఫికేషన్‌ను తమ కార్యాలయాల నోటీసు బోర్డులకే పరిమితం చేశారు. మండల స్థాయిలో పెద్దగా ప్రచారం చేయలేదు. పైగా కొందరు ఎంఈవోలు తమ దగ్గరి వారు, పరిచయస్తులు, సన్నిహితులకే మాత్రమే తెలిసేలా జాగ్రత్త పడ్డట్టు ఆరోపణలు ఉన్నాయి.

ఈ ఉద్యోగాల దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 2వ తేదీతో ముగిసింది. ఆయా పాఠశాలల హెచ్ఎంలు వాటిని పరిశీలించి సరిగా ఉన్న దరఖాస్తులను ఇప్పుడిప్పుడే సంబంధిత డీఈవో కార్యాయాల్లో అందజేస్తున్నారు. గురువారం వరకు దరఖాస్తులు అందుతూనే ఉన్నాయి. చివరి నిమిషంలో ఈ ప్రకటన చూసిన నిరుద్యోగులు గురువారం సాయంత్రం వరకు ఉరుకులు పరుగుల మీద ఎంఈవో ఆఫీసులకు వెళ్లి దరఖాస్తులు దాఖలు చేయడం కనిపించింది. ఈ అవకాశం లేనివారు నిరుత్సాహానికి లోనవుతున్నారు. నోటిఫికేషన్‌పై తగినంత ప్రచారం చేయకపోవడం వల్ల తమకు తెలియలేదని వారు చెబుతున్నారు. అన్ని అర్హతలు వున్నా దరఖాస్తు చేసుకోలేక పోయామని వారు తెలిపారు. అందువల్ల గడువును పెంచి దరఖాస్తులను స్వీకరించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ఇద్దరేసి చొప్పున...

వారం రోజుల క్రితం ఇన్‌స్ట్రక్టర్ (ప్రీ ప్రైమరీ టీచర్), ఆయా (హెల్పర్) పోస్టుల భర్తీకి డీఈవో కార్యాలయాలు నోటిఫికేషన్ జారీ చేశాయి. ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ. 8వేలు, ఆయాకు రూ. 6వేలు అది విద్యా సంవత్సరంలో పది నెలలకే చెల్లిస్తారు. ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టుకు కనీసం ఇంటర్ ఉత్తీర్ణత పొంది ఉండాలి. ప్రీ ప్రైమరీ బోధనకు సంబంధించిన ట్రైనింగ్/ సర్టిఫికెట్ (మాంటిస్సోరి, ఈసీసీఈ లేదా సత్సమానమైన కోర్సు) కలిగి ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తారు. బోధనలో అనుభవం ఉంటే ప్రాధాన్యత ఉంటుంది. ఇక అయా పోస్టుకు కనీస విద్యార్హత 7వ తరగతి ఉత్తీర్ణులైన ఉండాలి. చిన్నారుల సంరక్షణలో ఆసక్తి, అనుభవం కలిగినవారై ఉండాలి. ఎంపికలో అభ్యర్థులకు ఒకే నివాసం, ఒకే గ్రామ పంచాయతీ, ఒకే మండలం, ఒకే జిల్లావారికి ప్రాధాన్యం ఇస్తారు.

వయో పరిమితి నోటిఫికేషన్ వెలువడిన తేదీ నాటికి అభ్యర్థులు 18 నుండి 44 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయో సడలింపు వర్తిస్తుంది (ఎస్సీ, ఎస్టీఈ, బీసీ ఈడబ్ల్యూఎస్ వారికి 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3 సంవత్సరాలు వికలాంగులకు 10 సంవత్సరాలు). జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గల ఎంపిక కమిటీ పరిశీలించి అర్హులైనవారిని ఎంపిక చేస్తుంది. హనుమకొండ జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో 45 ప్రీ ప్రైమరీ తరగతులను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలు హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, కాజీపేట, పరకాల, శాయంపేట, వేలేరు మండలాల పరిధిలో ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 446 మంది బాలబాలికలు ఉన్నారు.

మధ్యవర్తిత్వం అద్భుతమైన పరిష్కార వేదిక

● జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వం అద్భుతమైన పరిష్కార వేదికని, దానిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ సూచించారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో గురువారం మీడియేషన్ ప్రాముఖ్యతను తెలియజేసే బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 90 రోజుల మీడియేషన్ జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు జరిగే కార్యక్రమంలో భాగం గా బోర్డును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార పద్ధతుల్లో మధ్యవర్తిత్వం ఒకటని సెక్షన్ 89 సివిల్ ప్రొసీజర్ కోడ్ యొక్క నిబంధనల ప్రకారం పార్టీలు, మధ్యవర్తుల సహాయంతో రాజీ మార్గంలో వారి కేసులను పరిష్కరించవచ్చన్నారు. మధ్యవర్తులు వివాదాన్ని పరిష్కరించే విషయంలో నిర్ణయం తీసుకోరు. కానీ, పార్టీలకు మార్గనిర్దశం చేస్తారని, తద్వారా కేసులను పరిష్కరించే మార్గ సుగమం అవుతుందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి శాలినీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిమురారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, ఏవో క్రాంతికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌చంద్, 8 మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆదివారం వీరభద్రస్వామి ఆలయం మూసివేత

కురవి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 7వ తేదీ ఆదివారం కురవి శ్రీవీరభద్రస్వామి ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ ఈవో సత్యనారాయణ తెలిపారు. ఆదివారం చంద్రగ్రహణం ఉండడంతో మధ్యాహ్నం పూజాధికాలు పూర్తి చేసి ఒంటిగంట నుంచి ద్వార బంధనం చేస్తామని వెల్లడించారు. మరుసటిరోజు సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయ తలుపులు తెరిచి సంప్రోక్షణ పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఉదయం 6 గంటల నుంచి భక్తులకు స్వామివారి, అమ్మవారి దర్శనం, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

విద్యా సంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులకు విద్యార్థులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని మహర్షి విద్యాలయలో నిర్వహించిన వేడుకల్లో కరస్పాండెంట్ ఎం.సుధాఅర్జున్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కరస్పాండెంట్ సుధాఅర్జున్‌రెడ్డి, డైరెక్టర్లు దేవిరెడ్డి, సూర్యకుమారి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు అనిల్‌కుమార్, మసూద్ అహ్మద్, సాంబశివరావు, వినోద్‌కుమార్, శ్రీనివాస్, హతిరామ్, ఖాసీంషా, సుమన్, ఉపేందర్, వీరు, సుమలత, సంతోష్‌కుమార్, రవితేజ, ఉదయ్‌కుమార్, నరేష్, యాకయ్య పాల్గొన్నారు. డిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో విశ్రాంత ఉపాధ్యాయులు సంకా బద్రినారాయణ, రాజేశ్వర్‌రావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ ప్రమోద్‌రెడ్డి, డైరెక్టర్ వద్దుల మహేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పార్వత్‌బాను, ఏవో మంజుల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మహర్షి విద్యాలయలో కరస్పాండెంట్ సుధాఅర్జున్‌రెడ్డి, డైరెక్టర్లు దేవిరెడ్డి, సూర్యకుమారి, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు



కాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయ బృందం

హనుమంతునిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో హెచ్ఎం హల్య, ఉపాధ్యాయులు బాలాజికుమార్, శంకర్, సాయికుమార్, శిరీష, వనజలను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో హెచ్ఎం జోలి గిరిజ, ఉపాధ్యాయులు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, ఉప్పలయ్య, సోహెన్‌బీ, శ్రీనివాసరావు, తిరుపతి, సతీష్‌కుమార్, సోమేశ్వర్, ఝాన్సీ, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, వీరభద్రం, యుగందర్, జ్యోతిలను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. సీరోలు మండలం కాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం హెచ్ఎం జోలి అరుణశ్రీ, ఉపాధ్యాయ బృందాన్ని విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

● కేసముద్రం : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కల్వల జడ్పీహైస్కూల్లో గురువారం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పీజీహెచ్ఎం బండారు నరేందర్, పీఎస్‌హెచ్ఎం కళ్లెం వీరారెడ్డితోపాటు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డి.రాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు.



కురవి బాలికల వసతి గృహంలో తనిఖీ నిర్వహిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

గిరిజన వసతి గృహం, పీహెచ్‌సీ తనిఖీ చేసిన కలెక్టర్

కురవి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కురవిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలోని పరిసరాలు, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్‌షెడ్డు, తరగతిగదులు, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను సందర్శించి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తరగతులను బోధించాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు, వేడివేడి ఆహారాన్ని అందించాలని, ఉపాధ్యాయులు తప్పక బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు కావాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వార్డులు, ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్, సాధారణ ప్రసవాలు, స్టోర్ గదులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండ జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబు, వైద్యాధికారి విరాజిత ఉన్నారు.

రికార్డుస్థాయిలో ఆదిదేవ లడ్డూ వేలం

● రూ.4,76,116లకు దక్కించుకున్న ఎన్‌ఆర్ఐ మంచెన రామకృష్ణ

కేసముద్రం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదిదేవ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద గురువారం రాత్రి నిర్వహించిన లడ్డు వేలం రికార్డు స్థాయిలో పలికింది. గత ఏడాది రూ.4.51లక్షలతో ఈ లడ్డు వేలం జరగగా ఈసారి అంతకు మించి రూ.4,76,116లకు కేసముద్రం స్టేషన్‌కు చెందిన న్యూజెర్సీలో ఉంటున్న మంచెన రామకృష్ణసౌమ్య దంపతులు దక్కించుకోవడం విశేషం. గత ఐదేళ్లుగా ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా ఈ లడ్డు పలుకుతుండడంతో ఈసారి ఉత్కంఠతగా వేలం సాగింది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ బాధ్యులు రామకృష్ణ సోదరులైన శ్రీనివాస్, మనోహర్‌లను ఘనంగా సన్మానించారు. గత ఏడాదికంటే మరో రూ.25వేలు పెరిగి ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక లడ్డువేలం కావడంతో చర్చనీయాంశంగా మారింది.

'అద్దె వాహనం కోసం దరఖాస్తు చేసుకోవాలి'

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి వాహనం నడిపేందుకు అద్దె వాహనం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో రవిరాథోడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలియేటివ్‌విభాగం (ఉపశమన సంరక్షణ)లో పని చేయుటకు ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడే విధంగా ఉన్న వాహనం వినియోగించుటకు అర్హులైన వారు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ వాహనం జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో తిరగవలసి ఉంటుందని, నెలలో 2500 కిలోమీటర్లు తిరుగుటకు గాను రూ. 50 వేలు అద్దె చెల్లించడం జరుగుతుందన్నారు. అందుకు గాను మారుతి ఈకో వాహనం ఏసితో యుక్తంగా పోలిన వాహనం, స్ట్రెక్చర్ ఆక్సిజన్ సిలిండర్, బేసిక్ ఫిజియో ఈ ట్రీట్మెంట్ ఉండాలని, వాహనంలో ముగ్గురు లేదా నలుగురు కూర్చునే విధంగా సీటింగ్ ఉండవలెనని, (డ్రైవర్ కాకుండా), వాహనం ఎమర్జెన్సీ సమయాల్లో డ్యూటీ ముగిసిన తర్వాత వాహనం అందుబాటులో ఉండాలని, వాహనానికి జీపిఎస్ ట్రాకింగ్ అమర్చబడి ఉండాలన్నారు.

నిమజ్జనానికి వేళాయే..

(3వ పేజీ తరువాయి)

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్, డీఈ ఉపేందర్, ఇతర అధికారులు, సిబ్బంది దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ వేర్వేరుగా ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. పట్టణంలోని కొన్ని విగ్రహాలు ఐదవ రోజు నిమజ్జనం చేయగా పెద్ద మొత్తంలో ఉన్న విగ్రహాలను శుక్రవారం నిమజ్జనం చేయనున్నారు. నిజాం చెరువు వద్ద ప్రజలులోనికి రాకుండా భారీ కేడతో పాటు రాత్రి పొద్దు పోయేంత వరకు నిమజ్జనం జరుగనున్నందున విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.



మూడు క్రేన్‌లు, గజ ఈతగాళ్లు..

జిల్లా కేంద్రంలోని నిజాం చెరువులో వినాయ విగ్రహాల నిమజ్జనం చేసేందుకు మూడు క్రేన్‌లు.. మూడు పడవలతో కూడిన ఒక తెప్ప... పది మంది గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. రెండు క్రేన్‌లు.. తెప్పతో విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. అదనంగా ఒక క్రేన్‌ను చెరువు వద్ద అందుబాటులో ఉంచుతున్నారు. ఇక 10 మంది గజ ఈతగాళ్లను సిద్దం చేశారు. కాగా, ప్రతీ వినాయక విగ్రహానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికి నారికేళం సమర్పించి పూజల అనంతరం నిజాం చెరువుకు సాగనంపేందుకు జిల్లా కేంద్రంలోని ఫారెస్టు సెంటర్‌లో ఆహ్వాన వేదికను ఏర్పాటు చేశారు. తాజాగా గురువారం నిజాం చెరువు వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను పోలీస్, మునిసిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని చెప్పారు. కాగాఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. పోలీసులు, మునిసిపల్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది మొత్తంగా 500 మంది నిమజ్జన విధులు నిర్వహించనున్నారు.

అక్రమ కేసులను ఎత్తి వేయాలి

● డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్,సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని పోరాడిన సమయంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్, సీపీఐ నాయకులపై అక్రమ కేసులు బనాయించిందని వాటిని వెంటనే ఎత్తి వేయాలని డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి కోరారు. బయ్యారం ఉక్కు ఉద్యమ కేసులో మహబూబాబాద్ జిల్లా కోర్టుకు గురువారం డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, గుగులోతు దస్రూనాయక్, సీపీఐ నాయకులు రేషపల్లి నవీన్న, మేక వీరన్న, కేదాసు రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బయ్యారం ఉక్కు మానుకోట హక్కు అని, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దక్కుతాయన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతిపై కేసు

డోర్నకల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందడంతో కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ చంద్రమౌళి గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ మండలం చాంప్లాతండాకు చెందిన లకావత్ జామ్లా(68) అనే వ్యక్తి డోర్నకల్‌కు చెందిన రత్నం ఇంటిలో పనిమనిషిగా పనిచేస్తున్నాడు. రోజులాగానే తన యాజమాని ఇంటికి వచ్చిన జామ్లా అక్కడ చనిపోయాడు. దీంతో యాజమాని జామ్లాకుమారుడు నరేష్‌కు సమాచారం అందించాడు. ఇంటివద్ద నుంచి ఆరోగ్యంగానే వచ్చిన తన తండ్రి ఎలా మృతి చెందుతాడని యాజమాని ప్రశ్నించాడు. ఆపై డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మృతుని కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న లారీ

● తప్పిన పెనుప్రమాదం

డోర్నకల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం అమ్మపాలెంలో గురువారం కట్టెల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి రెండు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టింది. లారీఢీకొట్టడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగి కిందపడ్డాయి. అప్పటికే విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై ఫిర్యాదు చేశారు. విద్యుత్‌శాఖ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రమౌళి తెలిపారు.

'లంబాడీల జోలికి వస్తే ఊరుకునేది లేదు'

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 04 (ఆంధ్రజ్యోతి): లంబాడీల జోలికి వస్తే ఊరుకునేది లేదని, లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కొంతమంది వ్యక్తులు సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ రవినాయక్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ డీసీసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..... తెలంగాణ రాష్ట్రంలో లంబాడలు, ఆదివాసీలు కలిసి మెలసి సంతోషంగా జీవిస్తున్న క్రమంలో కొందరు రాజకీయ లబ్ధికోసం రెండు వర్గాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావులకు లంబాడ బిడ్డలుగా తాము సూచిస్తున్నామని సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. 1976లో రాజ్యాంగ బద్దంగా ఆర్టికల్ 342 ద్వారా గిరిజనులకు రిజర్వేషన్లను పొందుపర్చారనిపేర్కొన్నారు. ఆదివాసీ, లంబాడ వర్గాల మధ్య విభేదాలు సృష్టించవద్దని షెడ్యూల్ తెగల జాతులంతా కలిసి మెలసి ఐక్యంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్‌నాయక్, బానోత్ హరిసింగ్, భూక్య రవి, అజ్మీర శ్రీను, తేజావత్ శంకర్, వెంకన్న, సురేష్, మంగిలాల్, శ్రీరామ్, రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ రవినాయక్

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైంది

● ఎంఈవో మహంకాళి బుచ్చయ్య

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 4 : అన్ని వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైందని ఎంఈవో బుచ్చయ్య అన్నారు. సెప్టెంబరు 5న భారత మాజీ ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని మండలంలోని చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులు ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం ఎంఈవో బుచ్చయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి తమ కర్తవ్యాన్ని నెరవేర్చాలని సూచించారు. సమాజానికి సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం ఎంతో ఆదర్శవంతమైందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థిని, విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తను, యాకూబ్‌అలీ, జయపాల్ రెడ్డి, కృష్ణ, కరుణాకర్ రెడ్డి, మల్లయ్య, స్వర్ణలత, కవిత, ఉమా, రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పూజోత్సవం

మరిపెడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ హైస్కూల్, మరిపెడ బంగ్లాలోని సీతారాంపూర్ హై స్కూల్‌లో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురష్కరించుకొని గురువారం ఆ స్కూళ్లల్లో గురుపూజోత్సవాన్ని టీచర్లు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. సీతారాంపూర్ స్కూళ్లో జరిగిన వేడుకలకు ఎంఈవో అనిత పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిర్యాలీకి మానుకోట ఎమ్మెల్యేకు ఆహ్వానం

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే దురుద్దేశంతో ఆదివాసీ నాయకులు కోర్టుకెళ్లడాన్ని నిరసిస్తూ ఈనెల 9న వరంగల్‌లో నిర్వహించే శాంతిర్యాలీకి మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌ను ఆహ్వానిస్తున్నట్లు లంబాడీ కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కన్వీనర్ జైసింగ్‌రాథోడ్ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మురళీనాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ.. ఆదివాసీలైన కోయ, గోండు ప్రజాప్రతినిధులైన తెల్ల వెంకట్రావ్, స్వయం బాబురావు తమ వ్యక్తిగత స్వలాభం కోసం లంబాడీలపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని, లంబాడీలు ఎస్టీలు కాదని, వారిని తక్షణమే జాబితా నుంచి తొలగించాలనే కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. తక్షణమే ఇలాంటి విధానాలను మానుకోవాలని, లేనిఎడల లంబాడీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాటోతు కిషన్‌నాయక్, బోడ లక్ష్మణ్‌నాయక్, గుగులోతు హరినాయక్, భాస్కర్‌నాయక్, వెంకన్ననాయక్ పాల్గొన్నారు.

డీజే సౌండ్ సిస్టమ్ నిర్వాహకులను బైండోవర్

● టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలోని డీజే సౌండ్ సిస్టమ్ నిర్వాహకులందరిని మానుకోట తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ జి.మహేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. సీఐ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన డీజే సౌండ్ సిస్టమ్‌ను ఎట్టి పరిస్థితిలో నిమజ్జన ఊరేగింపులో పెట్టరాదన్నారు.

రాంపురం వంతెనకు నిధులు మంజూరు చేయాలి : బీజేపీ

గార్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న గార్ల మండలం రాంపురం సమీపంలోని పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని బీజేపీ మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు, సీతంపేట మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి కోరారు. ఈ మేరకు గురువారం డిల్లీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ.. ప్రతియేట వర్షాకాల సమయంలో పాకాల వాగుపై ఉధృతంగా నీరు ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయని చెప్పారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వద్దిరాజు రాంచందర్‌రావు ఉన్నారు.

యూరియా మాయంపై విచారణ

బయ్యారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యూరియా మాయంపై గురువారం పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. అధికారుల విచారణలో పలు విషయాలు వెలుగుచూసినట్లు తెలిసింది. బయ్యారం మండలం కొత్తపేట గ్రామంలోని శ్రీదివ్య ఫర్టిలేజర్ షాపుకు మొత్తం 222 బస్తాలు యూరియా వచ్చినట్లు సమాచారం. ఫర్టిలేజర్ షాపు నిర్వాహకులు తన షాప్ పేరు మీద వచ్చిన యూరియాను మహబూబాబాద్ నుండి ట్రాక్టర్లు, బొలేరో వాహనాల ద్వారా కొత్తపేటలో డంపింగ్ చేసి రైతులకు పంపిణీ చేసినట్లుగా అధికారుల విచారణలో వెలుగుచూసినట్లు తెలిసింది. అనంతరం సాంకేతికంగా ఇబ్బంది లేకుండా ఉండేందుకు గాను నిర్వాహకుడు ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ చేసిన యూరియాను రైతుల పేర రసీదులు కట్‌చేసి రహస్యంగా ఈ పాస్ మిషన్‌లో ఎంట్రీ చేసినట్లుగా విచారణలో వెలుగుచూసినట్లు సమాచారం. యూరియాను స్టాక్ రిజిష్ట్రర్లో ఎంట్రీ చేయకపోవడం, వేరే ప్రాంతం నుంచి డంపింగ్ చేయటం, అధికారుల అనుమతి లేకుండా ఇష్టానుసారంగా పంపిణీ చేయటం తదితర అంశాల్లో నిర్వాహకుడికి షోకాజ్ నోటీస్ ఇచ్చి లైసెన్స్‌ను కొంత కాలం పాటు సస్పెన్స్ చేసినట్లు సమాచారం. ఈ విషయమై ఏవో రాంజీ నాయక్‌ను వివరణ కోరగా.. తమ విచారణలో వెల్లడైన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి కూడా యూరియా మాయంపై పలు కోణాల్లో విచారణ చేపట్టారు.

అన్నదాత ఆక్రోశం

(3వ పేజీ తరువాయి)

వెల్లడించారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల వరకు యూరియా పంపిణీని రైతులు అడ్డుకున్నారు. బస్తాలను సైతం రైతులు గోదాం నుంచి తీసుకువెళ్లే ప్రయత్నం చేయగా, పోలీసులు అడ్డుకున్నారు. టోకెన్లు జారీ చేసిన రైతులతో టోకెన్లు రాని వారు ఘర్షణకు దిగారు. గోవిందాపురానికి చెందిన ధరంసోత్ కాంతి కుడిచేతికి గాయం కావడంతో విలపించింది. సొసైటీకి 660 బస్తాలు రాగా, సుమారు 2500 మంది రైతులు యూరియా కోసం తరలివచ్చారు. టోకెన్లు లేకుండా యూరియా అందించాలని రైతులు అధికారులతో వాగ్వావాదంకు దిగారు. చీపురు, కర్రలతో మహిళ రైతులు ఆందోళనకు దిగడంతో సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డి పోలీస్‌లతో కలిసి రైతులతో మాట్లాడి శాంతింప చేశారు.

టోకెన్లను రద్దు చేస్తున్నాం

- చైర్మన్ చల్లా లింగారెడ్డి

యూరియా పంపిణీ కోసం గతంలో ఇచ్చిన టోకెన్లను గురువారం నుంచి రద్దు చేస్తున్నట్లు గూడూరు సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే టోకెన్లను రద్దు చేసి క్లస్టర్ వైజ్‌గా యూరియా అందించనున్నట్లు చెప్పారు. గూడూరు మండలాన్ని ఆరు క్లస్టర్లుగా విభజించినట్లు పేర్కొన్నారు. 1.గూడూరు పాత గ్రామపంచాయతీ, 2. మచ్చర్ల, దామరవంచ, మట్టెవాడ, ఊట్ల, 3. అప్పరాజుపల్లి, కొల్లాపురం, గోవిందాపురం, బొద్దుగొండ, 4. నాయకపల్లి, తీగలవేణి, బొల్లెపల్లి, రాజన్‌పల్లి, 5. పొనుగోడు, అయోధ్యపురం, గాజులగట్టు, గుండెంగ, మదనాపురం, 6. భూపతిపేట, సీతానగరం, చిన్న ఎల్లాపురం పాత గ్రామపంచాయతీలను ఆధారంగా చేసుకుని క్లస్టర్లుగా విభజించినట్లు చెప్పారు. పట్టాపాస్ పుస్తకం కానీ, హక్కు పత్రాలు కానీ రైతులు వెంట తీసుకురావాలన్నారు.



గోదాము నుంచి యూరియా బస్తాలను ఎత్తుకెళ్తున్న రైతులను అడ్డుకుంటున్న హమాలీలు

అన్నదాతల అవస్థలు..

● నర్సింహులపేట : మండలంలో యూరియా కోసం అన్నదాతలు పడుతున్న కష్టాలు అన్ని ఇన్నీ కావు. తెల్లవారుజాము నుంచి నర్సింహులపేటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు పరుగులు పెడుతున్నారు. రైతులు వ్యవసాయ పనులన్నీ వదులుకొని కుటుంబ సమేతంగా వచ్చి క్యూలైన్‌లో చెప్పులు పెట్టి కూపన్ల కోసం నిలుచుంటున్నారు. గురువారం సొసైటీ వద్ద పరిస్థితిని జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల రైతులతో మాట్లాడారు. రైతులెవరు ఆందోళన చెందవద్దని రైతులందరికీ సరిపడ యూరియా ప్రభుత్వ అందిస్తుందని తెలిపారు.



పొగుళ్లపల్లిలో హమాలీలను ప్రశ్నిస్తున్న ఏవో ఉదయ్, ఎస్సై రాజ్‌కుమార్

పొగుళ్లపల్లిలో..

● కొత్తగూడ : పొగుళ్లపల్లిలోని సొసైటీ గోదాము నుంచి యూరియా బస్తాలు మాయం అయినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఏవో ఉదయ్, ఎస్సై రాజ్‌కుమార్ విచారణ చేపట్టారు. రైతులు యూరియా బస్తాల కోసం పొగుళ్లపల్లిలోని సొసైటీ వద్దకు వచ్చి యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు సొసైటీ వద్ద ఉంటూ రైతులకు యూరియాను సరఫరా చేస్తున్నారు. కాగా, గురువారం సొసైటీ వద్దకు వచ్చిన ఏవో ఉదయ్, ఎస్సై రాజ్‌కుమార్ గోదాములోని యూరియా బస్తాల నిల్వలను ఈపాస్‌లో సరిచూడగా 95బస్తాల యూరియా తేడా రావడంతో బస్తాలు మాయమైనట్టు గుర్తించారు. ఏవో, ఎస్సై సొసైటీ కార్యాలయం సీసీ కెమెరాల్లో చెక్ చేశారు. సొసైటీ సిబ్బందిని ప్రశ్నించారు. అయిన లెక్కతేలకపోవడంతో హమాలీలను ప్రశ్నించారు. హమాలీలు 31 మంది తామే యూరియాను తీసుకున్నట్టు ఒప్పుకున్నారని ఏవో, ఎస్సై పేర్కొన్నారు.



మహబూబాబాద్‌లోని మన గ్రోమోర్ సెంటర్ ముందు నిప్పుపెట్టిన రైతులు

కింద పడిపోయిన వృద్ధుడు

యూరియా కోసం వచ్చిన వృద్ధుడు వరుసలో నిల్చుని స్పృహతప్పి పడిపోగా, ఎస్సై రాజ్‌కుమార్ ఆయనను పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని ఈశ్వరగూడెం గ్రామానికి చెందిన కుంజ లక్ష్మీనర్సు యూరియా బస్తాల కోసం గురువారం పొగుళ్లపల్లిలోని సొసైటీ వద్దకు వచ్చాడు. వరుసలో నిలబడగా స్పృహతప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న ఎస్సై రాజ్‌కుమార్ తన వాహనం హుటాహుటిన కొత్తగూడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తీసుకువచ్చాడు. వైద్యుడు లక్ష్మీనర్సుకు చికిత్స అందించారు. కాగా, గత మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నానని, యూరియా అవసరం కావడంతో సొసైటీ వద్దకు వచ్చానని లక్ష్మీనర్సు పేర్కొన్నారు.